సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 30 । అక్టోబర్ । 2023



ఓటు వజ్రాయుధం..
ఓటు వజ్రాయుధం వంటిదని, ప్రలోభాలకు గురై దుర్వినియోగం చేయవద్దని డీఎస్పీలు పేర్కొన్నారు.
10లో



మేడారం బస్సు షురూ..
ఇల్లెందు నుంచి గుండాల, పస్రా మీదుగా సమ్మక్క సారలమ్మ జాతర ప్రదేశం మేడారానికి బస్సు ప్రారంభమైంది.
12లో

గరిష్ఠం / కనిష్ఠం
32° / 21°

వాతావరణం
జిల్లాలో సోమవారం మధ్యాహ్నానికి ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంది. రాత్రి వేళ వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ పుష్పార్చన

సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శన అవకాశం



కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో ఆదివారం అంతరాలయంలోని మూలమూర్తులకు అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా శనివారం సాయంత్రం మూసివేసిన ఆలయ తలుపులను అధికారులు ఆదివారం తెల్లవారుజామున 3 గంటలకు తెరిచారు. గోదావరి నుంచి తెచ్చిన జలాలతో ఆలయాన్ని సంప్రోక్షణ గావించారు. అనంతరం గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. ఉదయం 7 గంటల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు.

కమనీయంగా నిత్యకల్యాణం
నిత్యకల్యాణానికి స్వామివారిని పల్లకీ సేవగా చిత్రకూట మండపానికి తీసుకొచ్చి కొలువుదీర్చారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివార్లకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రసాదాలను స్వీకరించారు. ఆదివారం కావడంతో ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది.

నల్ల నేలలో ఎర్రమందారం



ఇల్లెందు అసెంబ్లీ నియోజకవర్గంలో పదిసార్లు ఎన్నికలు జరిగితే.. తొమ్మిదిసార్లు పోటీ చేసిన ఆయన ఐదుసార్లు విజయ కేతనం ఎగురవేశాడు. నమ్మిన సిద్ధాంతాన్ని, ఎత్తిన ఎర్రజెండాను వీడకుండా దశాబ్దాలుగా పోరు సాగిస్తున్న సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నేత గుమ్మడి నర్సయ్య ఈ సారి ఎన్నికల బరిలో నిలిచే అవకాశం లేదంటున్నారు. ఆయన కుమార్తె, ఉస్మానియా లా కళాశాల అధ్యాపకురాలు గుమ్మడి అనురాధ ఇల్లెందు బరిలో నిలిచేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి ప్రజాపంథా స్పష్టత ఇచ్చే అవకాశం ఉందని, కూతురుకు మద్దతు ఇచ్చే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది. –ఇల్లెందు



మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

తొమ్మిది విడతలుగా బరిలో గుమ్మడి నర్సయ్య
- ఇల్లెందులో ఐదుసార్లు గెలుపు.. నాలుగుసార్లు ఓటమి
- ఈసారి పోటీలో నిలిచే అవకాశం లేదనే చర్చ
- కుమార్తె అనురాధ పోటీ చేస్తే మద్దతిచ్చే చాన్స్

కంచుకోటకు బీటలు..
ఇల్లెందు పేరు వింటేనే 'గుమ్మడి నర్సయ్య' గుర్తుకు వస్తారు. అలాంటి 'గుమ్మడి' సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథాకు ఆయువుపట్టు. తన గెలుపును ఆ పార్టీ విస్తరణ కోసం ఉపయోగించుకుంది. అనేక ఏళ్ల పార్టీ ఆదేశాలతో పనిచేశారు. ఎంఎల్ పార్టీ ఆది నుంచి అనేక సంక్షోభాలను, ఒత్తిడులను తట్టుకుని ఇల్లెందులో పట్టు నిలుపుకుంటూ వచ్చింది. 2009 పునర్విభజనతో మారిన నియోజకవర్గ భౌగోళిక స్వరూపం, మరోవైపు పార్టీలో చీలికలు అశనిపాతంలా మారాయి. ప్రజాపంథా, న్యూడెమోక్రసీ పేరుతో రాష్ట్రంలో సాయుధ దళాల సంపత్తి కలిగి, కార్యకలాపాలు నడిపిన పార్టీపై చీలికల ప్రభావం తీవ్రంగా పడింది. ఇల్లెందు అసెంబ్లీ సీటులో ఆరు దఫాలు ఏకఛత్రాధిపత్యం సాగించిన పార్టీ గత మూడు దఫాల్లో ఓటమికి గురైంది.

పునర్విభజనతో తీవ్రనష్టం..
ఐదుసార్లు గుమ్మడి, ఒకసారి చాపల ఎర్రయ్య ఈ నియోజకవర్గంలో గెలిచారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజన జరిగి న్యూడెమోక్రసీ కంచుకోటకు బీటలు వారాయి. ఇల్లెందు, గుండాల, బయ్యారం, గార్ల, కారేపల్లి, టేకులపల్లి మండలాలతో విస్తరించిన నియోజకవర్గం.. పునర్విభజనతో భౌగోళికస్వరూపం మారిపోయింది. గుండాల మండలాన్ని పినపాకలో, కారేపల్లి మండలాన్ని వైరాలో కలిపారు. సుజాతనగర్‌లో ఉన్న కామేపల్లి మండలాన్ని ఇల్లెందులో కలిపారు. దీంతో న్యూడెమోక్రసీకి అత్యధిక ఓటర్లు కలిగిన గుండాల, కారేపల్లి..నియోజకవర్గం నుంచి వేరు కావడంతో గుమ్మడికి ఓటమి తప్పలేదు. కాగా 2023 ఎన్నికల్లో ఎంఎల్ పార్టీ మూడు వర్గాలుగా చీలిపోయి వేర్వేరుగా పోటీ పడనుండగా, ఏ మేరకు ప్రభావం చూపుతాయనేది వేచి చూడాల్సిందే.

గుమ్మడి ప్రస్థానం ఇలా..
కారేపల్లి మండలం టేకులగూడెం గ్రామంలో సామాన్య గిరిజన రైతు కుటుంబం నుంచి వచ్చిన గుమ్మడి నర్సయ్య తొలుత సర్పంచ్‌గా గెలిచారు. ఐదు దఫాలు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. నాలుగు దఫాలు ఓడిపోయారు. ఇల్లెందు నుంచి 1978లో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా తరఫున చాపల ఎర్రయ్య గెలిచారు. ఆ తర్వాత ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేశారు. దీంతో ఆయన్ను పార్టీ బహిష్కరించింది. అనంతరం జరిగిన ఎన్నికల్లో గుమ్మడి నర్సయ్యను బరిలో దించగా విజయం సాధించారు. 1994లో సీపీఐ అభ్యర్థి ఊకె అబ్బయ్య టీడీపీ, సీపీఎం మద్దతుతో గెలుపొందారు. 1999 ఎన్నికల్లో మళ్లీ గుమ్మడి నర్సయ్యే గెలుపొందారు. అప్పటికే సీపీఐ నుంచి టీడీపీలో చేరిన అబ్బయ్యకు, టీడీపీ సిట్టింగ్ కేటగిరీలో టికెట్ ఇచ్చినా బీఫామ్ పోగొట్టుకున్నారు. టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచి 'సైకిల్'కు బదులు 'బండి' గుర్తు మీద పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఈ ఘటన ఆనాడు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

నేటి నుంచి పోలింగ్ సిబ్బందికి శిక్షణ

విధులు కేటాయించిన సిబ్బంది హాజరుకావాలని కలెక్టర్ ఆదేశం

సూపర్‌బజార్(కొత్తగూడెం): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు కేటాయించిన పీఓ, ఏపీఓలకు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో సోమవారం నుంచి శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. ఎన్నికల విధులు కేటాయించిన సిబ్బందికి శిక్షణా తరగతుల సమాచారాన్ని ఇప్పటికే పంపించారు. ఎవరికీ ఎలాంటి మినహాయింపు ఉండదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల స్పష్టం చేశారు. విధులు కేటాయించిన సిబ్బంది ఎవరైనా శిక్షణా తరగతులు, ఎన్నికల విధులకు గైర్హాజరైతే ఎన్నికల సంఘ నియమావళి ప్రకారం చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరికలు జారీ చేశారు. శిక్షణా తరగతులకు హాజరయ్యే సిబ్బంది తమ ఆర్డర్ కాపీ జిరాక్స్, ఓటరు ఐడీ కార్డు జిరాక్స్‌ను తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. వాటిని పోస్టల్ బ్యాలెట్ కోసం సంబంధిత అధికారులకు అందజేయాల్సి ఉంటుంది.

నియోజకవర్గాల వారీగా..
కొత్తగూడెం నియోజకవర్గానికి మూడు రోజులు, మిగిలిన ఇల్లెందు, పినపాక, అశ్వారావుపేట, భద్రాచలం నియోజకవర్గాలకు రెండు రోజులపాటు శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. అశ్వారావుపేట నియోజకవర్గానికి సంబంధించి ఈ నెల 30, 31 తేదీల్లో అశ్వారావుపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో శిక్షణాతరగతులను నిర్వహించనున్నారు. భద్రాచలం నియోజకవర్గానికి సంబంధించి భద్రాచలం కూనవరం రోడ్‌లోని ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో సోమ, మంగళవారాల్లో శిక్షణా తరగతులను నిర్వహించనున్నారు. కొత్తగూడం నియోజకవర్గానికి సంబంధించి సోమ, మంగళ, బుధ వారాల్లో సింగరేణి మహిళా కళాశాలలో, పినపాక నియోజకవర్గానికి సంబంధించి సోమ, మంగళ వారాల్లో మణుగూరు సింగరేణి క్లబ్ హాలులో శిక్షణా తరగతులను జరపనున్నారు. ఇల్లెందు నియోజకవర్గానికి సంబంధించి సోమ, మంగళవారాల్లో టీటీడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాలలో శిక్షణా తరగతులను నిర్వహించనున్నారు. ఉదయం 8.45 గంటల వరకు శిక్షణా తరగతులు నిర్వహించే ప్రాంతాలకు ఎన్నికల సిబ్బంది చేరుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి స్పష్టమైన ఆదేశాలను ఆదివారం జారీ చేశారు.

'స్ట్రాంగ్ రూం'లో అదనపు కలెక్టర్ తనిఖీ

అశ్వారావుపేటరూరల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంలను భద్రపరిచేందుకు కేటాయించిన స్ట్రాంగ్ రూంను ఆదివారం జిల్లా అదనపు కలెక్టర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పర్సా రాంబాబు పరిశీలించారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంను తనిఖీ చేసి, భద్రత వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళాశాలలో సోమవారం నుంచి నిర్వహించే పీఓ, ఏపీఓల శిక్షణా సమావేశం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు విధులు కేటాయించిన పీఓ, ఏపీఓలు నియోజకవర్గస్థాయిలో జరిగే శిక్షణకు హాజరుకావాలని సూచించారు. తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎన్నికల డీటీ సుచరిత, రామకృష్ణ పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ పర్సా రాంబాబు

జంగ్ తెలంగాణ

పెద్దమ్మగుడికి పోటెత్తిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న సివిల్ జడ్జి రామారావు కుటుంబం

పాల్వంచ: పెద్దమ్మతల్లి ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శ్రీనక దుర్గ అమ్మవారికి బోనాలు, సారె సమర్పించారు. అన్నప్రాశనలు, వాహన పూజలు, తలనీలాలు, అమ్మవారికి ఒడిబియ్యం, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు.

అమ్మవారి సేవలో న్యాయమూర్తి
జిల్లా సివిల్ జడ్జి బత్తుల రామారావు, శ్రీలక్ష్మి దంపతులు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తిని ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఇల్లెందుకు చెందిన కటకం వెంకటేశ్వర్లు, వరలక్ష్మి దంపతులు రూ.5,116 విరాళం అందించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మహిపతి రామలింగం, ఈఓ రజనీకుమారి, సందుపట్ల శ్రీనివాసరెడ్డి, చింతా నాగరాజు, గంధం వెంగళరావు, సంకా వెంకట రామారావు పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల సత్తా చాటుదాం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

సూపర్‌బజార్(కొత్తగూడెం): అసెంబ్లీ ఎన్నికలలో కమ్యూనిస్టుల సత్తా చాటుదామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. స్థానిక శేషగిరిభవన్‌లో ఆదివారం భద్రాద్రి జిల్లా, ఖమ్మం జిల్లాల ఉమ్మడి కార్యవర్గం, కొత్తగూడెం నియోజకవర్గ స్థాయి జనరల్‌బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన 10 సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో విచ్చలవిడిగా పాలన సాగిందని విమర్శించారు. మంద బలంతో ప్రతిపక్షాల గొంతునొక్కి ప్రజలకు తీరని అన్యాయం చేశారని అన్నారు. గతరెండు పర్యాయాల పాలనలో సంక్షేమ పథకాల అమలులో చతికిలపడిన కేసీఆర్ ప్రభుత్వం మరోసారి ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాగం హేమంతరావు మాట్లాడుతూ కేసీఆర్ ప్రవేశపెట్టిన ఏ పథకమూ పేదల దరి చేరలేదని, కేవలం గులాబీదండు జేబులు నింపడానికే పథకాలు ఉపయోగపడ్డాయని విమర్శించారు. కాషాయపార్టీతో అంతర్గత ఒప్పందం కుదుర్చుకుని కమ్యూనిస్టులను దూరం చేసుకున్నారని, ఇదే కేసీఆర్ పతనానికి నాందికానుందని వ్యాఖ్యానించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగూడెం నియోజకవర్గం నుంచి గెలిచేది కమ్యూనిస్టు పార్టీయేనని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఇతర నియోజకవర్గాలలో కమ్యూనిస్టుల పాత్రే కీలకం కానుందని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు బి.అయోధ్య, మహ్మద్ మౌలానా, దండి సురేష్, మిర్యాల రంగయ్య, మున్నా లక్ష్మీకుమారి, బందెల నర్సయ్య, గుత్తుల సత్యనారాయణ, కల్లూరి వెంకటేశ్వరరావు, కెసారయ్య, ముత్యాల విశ్వనాథం, నరాటి ప్రసాద్, జితేందర్‌రెడ్డి, ఎర్రబాబు, జానీమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, ఎస్ కర్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కూనంనేని

మూడోసారి కూడా కేసీఆరే సీఎం..

- ఎమ్మెల్యే మెచ్చాను మళ్లీ గెలిపించుకోవాలి
- బడుగు, బలహీన వర్గాలను కాంగ్రెస్ పట్టించుకోలేదు
- ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ఎంపీ నామా నాగేశ్వరరావు

అశ్వారావుపేటరూరల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పదకొండు సార్లు గెలిచి ఏం చేసిందని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి పదేళ్లలో అభివృద్ధి అంటే ఏమిటో చేతల్లో చూపించారని, పథకాలు, అభివృద్ధే కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేస్తాయని పేర్కొన్నారు. మండలంలోని వినాయకపురం గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అధ్యక్షతన ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు బడుగు, బలహీన, పేద, మహిళలను కాంగ్రెస్ పట్టించుకోలేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ విద్యుత్, సాగు, తాగునీరు, రైతులకు సకాలంలో ఎరువులు, ఇంటింటికీ నల్లాలను అందుబాటులోకి తీసుకొచ్చారని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు, బీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్, సీఎం సహాయ నిధి చెక్కులతోపాటు మరెన్నో పథకాలు ప్రతి ఇంటికి వెళ్లాయని తెలిపారు. సీఎం కేసీఆర్ అమలు చేసిన ప్రతి పథకం, తాజాగా ప్రకటించిన మేనిఫెస్టోను ప్రతి గుమ్మానికి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని కోరారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో అన్ని రకాలుగా అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును మరోసారి గెలిపించాలని కోరారు.

వినాయకపురాన్ని మండలం చేస్తా : మెచ్చా
అశ్వారావుపేట నియోజకవర్గంలో తన శక్తికి మించి అభివృద్ధి చేశానని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. ఈ సారి ఎన్నికల్లో గెలిచాక మండలంలోని వినాయకపురం గ్రామ పంచాయతీ కేంద్రంగా కొత్త మండలం ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పాడియం సత్యవతి, రావు జోగేశ్వరరావు, జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, చిన్నంశెట్టి వరలక్ష్మి, చిట్టూరి ఫణింద్ర, నారం రాజశేఖర్, మారుతి లలిత, కోటగిరి సీతారామస్వామి, మహిపాల్, మందపాటి మోహన్‌రెడ్డి, బిర్రం వెంకటేశ్వరరావు, శీమకుర్తి వెంకటేశ్వరరావు, సంకా ప్రసాద్, ఉప్పల ప్రసాద్, లీలా ప్రసాద్, నార్లపాటి రాములు పాల్గొన్నారు.

సివిల్ కాంట్రాక్ట్ మాన్యువల్‌ను సవరించాలి



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టర్లు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగా ప్రవేశపెట్టిన సివిల్ కాంట్రాక్ట్ మాన్యువల్–2023ను సవరించాలని శనివారం రాత్రి సింగరేణి హెడ్డాఫీస్ ఎదుట కాంట్రాక్టర్లు ఆందోళన నిర్వహించారు. డైరెక్టర్ (పా) ఎస్.బలరామ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు మాట్లాడుతూ డిబార్ అండ్ బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న విధి విధానాలను మార్పుచేయాలని కోరారు. కాగా సమస్యలపై డైరెక్టర్ సానుకూలంగా స్పందించారని కాంట్రాక్టర్లు తెలిపారు.

పొత్తు కుదరకపోతే అన్ని స్థానాల్లో పోటీ

- చర్చల పేరుతో కాంగ్రెస్ కాలయాపన
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

సింగరేణి(కొత్తగూడెం): కాంగ్రెస్‌తో పొత్తు కుదరకపోతే జిల్లాలో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రకటించారు. ఆదివారం మంచికంటి భవన్‌లో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ చర్చల పేరుతో కాలయాపన చేస్తోందని ఆరోపించారు. వామపక్షాలు అడిగే సీట్లను ఇచ్చే వాతావరణం కనిపించడంలేదని, కొన్ని సీట్లలో సర్దుకుపోవాలనే ప్రయత్నం వామపక్షాలు చేసినా కాంగ్రెసు కలుపుకుని పోయే పరిస్థితి కనిపించటం లేదన్నారు. తమ స్వతంత్రతను కాపాడుకునేందుకు ఎన్నికల బరిలో నిలుస్తామని, జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో పోటీకి సిద్ధంగా ఉన్నామని వివరించారు. రాష్ట్రంలో గెలుపోటములు నిర్ణయించే శక్తి సీపీఎంకు ఉందని, నాలుగు స్థానాల్లో కమ్యూనిస్టులకు మద్దతిస్తే, రాష్ట్రమంతా కమ్యూనిస్టులు మద్దతిస్తారనే స్పృహ కాంగ్రెస్‌కు ఉండాలని హితవు పలికారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.సోమయ్య, బత్తుల హైమావతి, సీఐటీయూ అఖిల భారత ఉపాధ్యక్షుడు సాయిబాబు, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, యలమంచిలి రవికుమార్, కొక్కెరపాటి పుల్లయ్య, ఎం.జ్యోతి, కే.బ్రహ్మచారి, బాలరాజు, కారం పుల్లయ్య, అన్నవరపు సత్యనారాయణ, కున్సోత్ ధర్మా, కొండపల్లి శ్రీధర్, రేణుక, రవి, శ్రీను, గంగ, వంశీ, అర్జున్, వెంకటేశ్వర్లు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని

'చేయూత'నిచ్చిన పినపాక

- 2009 పునర్విభజనలో నియోజకవర్గ ఆవిర్భావం
- రెండుసార్లు కాంగ్రెస్, ఒకసారి వైఎస్సార్ సీపీ విజయం
- 2023 ఎన్నికల్లో గెలుపు ఎవరిని వరించేనో...?



రేగా కాంతారావు



పాయం వెంకటేశ్వర్లు

బూర్గంపాడు: నియోజకవర్గాల పునర్విభజన–2009లో పినపాక అసెంబ్లీ నియోజకవర్గం(ఎస్టీ రిజర్వ్‌డ్) ఆవిర్భవించింది. అంతకుముందు ఉన్న బూర్గంపాడు నియోజకవర్గం రద్దు కావడంతో పినపాక రాజకీయ చిత్రపటం మీదకు చేరింది. ఈ అసెంబ్లీ సెగ్మెంట్‌లో బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, పినపాక, కరకగూడెం, గుండాల, ఆళ్లపల్లి మండలాలు ఉన్నాయి. రాష్ట్ర విభజనతో బూర్గంపాడు మండలంలోని నాలుగు రెవెన్యూ గ్రామాలు ఆంధ్రప్రదేశ్‌లో కలిశాయి. పినపాకలో 2009, 2018లో కాంగ్రెస్, 2014లో వైఎస్సార్ సీపీ గెలిచాయి. బీఆర్‌ఎస్ ఇప్పటివరకు ఒక్కసారి కూడా విజయం సాధించలేదు.

మొత్తం ఓటర్లు 1,93,943
పినపాక నియోజకవర్గంలో మొత్తం 241 పోలింగ్ స్టేషన్లున్నాయి. మహిళలు 98,235 మంది ఓటర్లు, పురుషులు 95,704 మంది ఓటర్లు, ఇతరులు నలుగురు.. మొత్తం 1,93,943 మంది ఓటర్లు ఉన్నారు. ఇక్కడ ఆదివాసీలే వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. బంజారాల ఓట్ల కంటే ఆదివాసీల ఓట్లే ఇక్కడ ఎక్కువగా ఉన్నాయి. దీంతో ఈ స్థానంలో ఆదివాసీల హవా నడుస్తోంది. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో నియోజకవర్గం అభివృద్ధి చెందుతుండటంతో ఓటర్లలో రాజకీయ చైతన్యం ఎక్కువగా ఉంది.

వైఎస్ చరిష్మాతో రేగా గెలుపు
2009లో పినపాక నియోజకవర్గంలో తొలిసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్, సీపీఐ(మహాకూటమి) పార్టీలు పోటీపడ్డాయి. నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి చరిష్మాతో తొలిసారి ఎన్నికల్లో పోటీచేసిన రేగా కాంతారావు విజయం సాధించారు. ప్రభుత్వ పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న ఆయన రాజకీయాలపై మక్కువతో ఉద్యోగానికి రాజీనామా చేసి నాటి ముఖ్యమంత్రి వైఎస్ ఆశీస్సులతో ఎన్నికల బరిలోకి దిగారు. పాయం వెంకటేశ్వర్లుపై విజయం సాధించారు. ఈ నియోజకవర్గంలో పట్టుఉన్న సీపీఐ, టీడీపీలు ఆ ఎన్నికల్లో ఉమ్మడిగా పనిచేసినా వైఎస్ పరిపాలన విధానాలతో కాంగ్రెస్ గెలుపును ఆపలేకపోయాయి.

2014లో వైఎస్సార్ సీపీ గెలుపు
రాష్ట్ర విభజన తర్వాత 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పినపాక నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ అనూహ్య విజయం సాధించింది. వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన పాయం వెంకటేశ్వర్లు, టీఆర్‌ఎస్ అభ్యర్థి శంకర్‌నాయక్‌పై ఘన విజయం సాధించారు. రాష్ట్ర విభజనతో అన్నిచోట్ల టీఆర్‌ఎస్ హవా నడిచిన ఇక్కడ మాత్రం వైఎస్ అభిమానులు వైఎస్సార్ సీపీకి పట్టం కట్టారు. ఈ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ పొత్తులో భాగంగా పినపాక సీటును సీపీఐకి కేటాయించింది. దీంతో కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే అయినప్పటికీ రేగా కాంతారావు పోటీ చేసే అవకాశం కోల్పోయారు. కాగా ఈ ఎన్నికల్లో సీపీఐ నాలుగో స్థానంలో నిలిచింది.

2018లో కాంగ్రెస్ విజయం..
2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో పినపాక నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీనే విజయం మళ్లీ వరించింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన రేగా కాంతారావు తమ ప్రత్యర్థి బీఆర్‌ఎస్ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లుపై విజయం సాధించారు. కాంతారావుకు ఇది రెండో గెలుపు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంతారావు కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం కాలంలో అప్పటి వరకు బీఆర్‌ఎస్‌లో కొనసాగిన పాయం వెంకటేశ్వర్లు కాంగ్రెస్ గూటికి చేరారు.

2023లో ఎవరో..?
2023 ఎన్నికల్లో పినపాక నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా రేగా కాంతారావు, కాంగ్రెస్ అభ్యర్థిగా పాయం వెంకటేశ్వర్లు బరిలోకి దిగుతున్నారు. పినపాక నియోజకవర్గంలో రెండుసార్లు పోటీ చేసి విజయం సాధించిన కాంతారావు మూడో విజయం కోసం పోరాడుతున్నారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా పోటీచేసి బూర్గంపాడు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఒకసారి, పినపాక నియోజకవర్గం నుంచి ఒకసారి మొత్తంగా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన పాయం వెంకటేశ్వర్లు కూడా మూడోసారి గెలుపుకోసం పోటీ పడుతున్నారు.

ఇప్పటివరకు గెలిచిన ఎమ్మెల్యేలు వీరే...

సంవత్సరం	విజేత	పార్టీ	సమీప ప్రత్యర్థి
2009	రేగా కాంతారావు	కాంగ్రెస్	పాయం వెంకటేశ్వర్లు
2014	పాయం వెంకటేశ్వర్లు	వైఎస్సార్ సీపీ	డాక్టర్ శంకర్‌నాయక్
2018	రేగా కాంతారావు	కాంగ్రెస్	పాయం వెంకటేశ్వర్లు

దళితబంధు ఏది.. డబుల్ ఇళ్లు ఏమయ్యాయ్..?

ఇల్లెందు మండలంలో హరిప్రియను అడ్డుకున్న ప్రజలు

ఇల్లెందురూరల్: ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ మండలంలోని కొమరారం, పోచారం తండా గ్రామాల్లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల వారు హరిప్రియకు ఊహించని షాక్ ఇచ్చారు. 'దళిత బంధు పథకం ఏది.. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు యాడపోయినయ్.. రేషన్‌కార్డులు.. కొమరారం కేంద్రంగా నూతన మండలం మాటలకే పరిమితమా' అంటూ తీవ్ర నిరసన తెలిపారు. కొమరారంలో ప్రచార రథానికి అడ్డుగా వచ్చి ఘెరావ్ చేసేందుకు యత్నించారు. వారితో మాట్లాడేందుకు ఎమ్మెల్యే హరిప్రియ ప్రయత్నించగా జనం అధిక సంఖ్యలో దగ్గరకు చేరుకోవడంతో పరిస్థితి అదుపు తప్పుతుందని భావించిన వ్యక్తిగత భద్రతా సిబ్బంది, స్థానిక పోలీసులు వాహనం వద్దకు చేరుకొని ఆందోళనకారులను బలవంతంగా పక్కకు నెట్టి ప్రచార రథాన్ని ముందుకు తీసుకెళ్లారు. అనంతరం పోచారంలోనూ స్థానికులు ప్రచార రథానికి అడ్డుపడి ఆందోళన చేశారు. దీంతో కాసేపు గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది.



కొమరారంలో ప్రచార రథం వద్ద నిరసన తెలుపుతున్న స్థానికులు

నోటుతో ఓటు.. ఎన్నికలను బహిష్కరించండి..

చర్ల: నోటుతో ఓటును కొనే బూటకపు ఎన్నికలను బహిష్కరించాలని, ప్రజాస్వామిక తెలంగాణను సాధించాలని, నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలని భారత కమ్యూనిస్టు (మావోయిస్టు) పార్టీ చర్ల, శబరి ఏరియా కమిటీ కార్యదర్శి అరుణ పిలుపునిచ్చారు. ఆదివారం ఆమె లేఖను విడుదల చేశారు. లేఖలోని వివరాల ప్రకారం.. ఐదేళ్లకోసారి జరిగే నాటకీయ రాజకీయ క్రీడ దగ్గర పడుతుండటంతో పార్లమెంట్ పార్టీలన్నీ ఒకరికి మించి ఒకరు పోటీ పడి హామీల మీద హామీలు గుప్పిస్తున్నారని ఆరోపించారు. డబ్బు, మద్యం ఏరులుగా పారిస్తూ కులం, మతాలను అడ్డుపెట్టుకుని ఓట్లు దండుకుంటున్నారని, సిగ్గు, ఎగ్గూ లేకుండా గెలిచిన అభ్యర్థులను కొని అడ్డదారిన అధికారం చేపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసీల కోసం రాజ్యాంగం కల్పించిన చట్టాలను అమలు చేయాలని ఓట్ల కోసం వచ్చే నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు.

నగదు సీజ్

దమ్మపేట: ఎన్నికల నిబంధనల మేరకు ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును పోలీసు లు సీజ్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆదివారం మండలంలోని మందలపల్లి చెక్‌పో స్ట్ వద్ద పోలీ సులు వాహనాలను తనిఖీ చేస్తుండగా కారులో తరలిస్తున్న రూ.4,34,500, బైక్‌పై తరలిస్తున్న రూ.52,000 నగదును గుర్తించారు. వాహనదారులు ఎలాంటి ఆధారా లు చూపకపోవడంతో నగదును సీజ్ చేశారు.

కూనవరం రోడ్డులో...

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని కూనవరం రోడ్డులో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును ఆదివారం పట్టుకున్నారు. కూనవరం నుంచి సారపాకకు వెళ్తున్న వ్యక్తి వద్ద రూ.53 వేల నగదు లభించగా ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేశామని టౌన్ సీఐ నాగరాజురెడ్డి వెల్లడించారు.

కామేపల్లి క్రాస్ రోడ్డు వద్ద..

కామేపల్లి: ఉత్తమ్‌మాలిక్ కారులో హైదరాబాద్ నుంచి ఒడిశా వెళ్తుండగా కామేపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో పోలీసులు తనిఖీ చేశారు. అతడి వద్ద రూ.59 వేల నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

కలెక్టరేట్ నుంచే కంట్రోల్

ఎన్నికల వేళ పర్యవేక్షణకు ఏర్పాట్లు

- చెక్‌పోస్టుల వద్ద అమర్చిన సీసీ కెమెరా ఫుటేజీల పరిశీలన
- సీ–విజిల్ యాప్‌నకు వచ్చే ఫిర్యాదుల పర్యవేక్షణ
- ఇక్కడి నుంచి వెళ్లే సమాచారం ఆధారంగా రంగంలోకి అధికారులు
- అనునిత్యం పర్యవేక్షిస్తున్న ఖమ్మం జిల్లా కలెక్టర్ గౌతమ్



కంట్రోల్ రూమ్‌లో వివిధ విభాగాల అధికారులు, (ఇన్‌సెట్) సీసీ టీవీ ఫుటేజీని పరిశీలిస్తున్న ఖమ్మం కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: శాసనసభ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈనెల 9వ తేదీన ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఆ వెంటనే కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. అదే రోజు నుంచి ఎన్నికల సందడి పూర్తిగా మొదలైంది. ఆ వెంటనే సీ – విజిల్ యాప్, జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయగా.. అక్కడ ఏర్పాటు చేసిన సీసీ టీవీల ఫుటేజీలను కంట్రోల్‌రూమ్‌కు అనుసంధానం చేశారు. అంతా ఇక్కడి నుంచే పర్యవేక్షిస్తున్నారు.

ఫిర్యాదులిలా..

కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌కు ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటి వరకు 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు 369 ఫోన్ కాల్స్ రాగా.. అందులో ప్రధానంగా ఓటు ఎక్కడ ఉందని కొందరు, కొత్తగా ఓటు నమోదు చేసుకున్నామని కొంత మంది, ఓటు మార్పునకు దరఖాస్తు చేసుకునే వివరాలు చెప్పాలంటూ మరి కొందరు.. ఇలా పలు రకాల సందేహాలను అడిగి నివృత్తి చేసుకుంటున్నారు. కంట్రోల్ రూమ్‌లోని వాట్సప్ నెంబర్ 9063211298కు సైతం ఫిర్యాదులు అందుతున్నాయి. సీ –విజిల్ యాప్‌నకు 106 ఫిర్యాదులు రాగా.. అందులో కొన్ని టెస్టింగ్ కోసం, కొన్ని మాత్రం పార్టీ జెండాలు, గుర్తులు లేనప్పటికీ ఫలానా రంగు ఉంది కదా అని చెబుతుండడంతో పార్టీ గుర్తులు, జెండాలు ఉన్న వాటిపై ఫిర్యాదు చేయాలని సూచనలు చేస్తున్నారు. ఇందులో 12 ఫిర్యాదులకు సంబంధించి పార్టీ జెండాలు ఉండటం, ఫ్లెక్సీలు, బ్యానర్లు ఉన్న వాటిని గుర్తించి తొలగించినట్లు అధికారులు చెబుతున్నారు. స్టాటికల్ సర్వైలెన్స్ టీమ్ చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు చేస్తుండగా.. అక్కడ రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయటంతో పాటు వాటిని సైతం కంట్రోల్‌రూమ్‌కు అనుసంధానం చేశారు. అదే విధంగా అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లా సరిహద్దులోని చెక్‌పోస్టులను సైతం పరిశీలిస్తున్నారు.

సీ – విజిల్‌కు ఇలా చేయాలి..

సీ – విజిల్ యాప్‌నకు పాత ఫొటోలు, వీడియోలు తీసి పంపించకుండా యాప్ డౌన్‌లోడ్ చేసుకున్న వారు లైవ్ లొకేషన్‌తో జరుగుతున్న సంఘటనను వీడియో, ఫొటోల రూపంలో చిత్రీకరించి పంపించాలని అధికారులు సూచిస్తున్నారు. దీని ద్వారా లైవ్ లొకేషన్ ఆధారంగా ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లోగా సమస్యను పరిష్కరించనున్నారు. ఫిర్యాదు అందిన సమయం నుంచి ఏ స్థాయి అధికారి ఎంత సమయంలో ఆ సమస్యను పరిష్కరించారనే వివరాలను సైతం కంట్రోల్‌రూమ్‌లో నమోదు చేస్తున్నారు. కొద్దిమంది యాప్‌లో పాత ఫొటోలు, వీడియోలు పంపిస్తుండడంతో వారికి లైవ్ ఫొటోలు, వీడియోలు పంపించాలని సూచనలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.



జీపీఎస్ ఆధారంగా ఎఫ్‌ఎస్‌టీ బృందాల వాహనాలు తిరుగుతున్న దిశను సూచిస్తున్న కంట్రోల్ రూమ్ టీవీ

ఎఫ్‌ఎస్‌టీకి జీపీఎస్..

ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్(ఎఫ్‌ఎస్‌టీ)లు జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ఉండగా.. వీరు ఉపయోగిస్తున్న 11 వాహనాలకు జీపీఎస్‌ను అమర్చారు. దీంతో వారు ఏ ప్రాంతాల్లో ఎవరెవరు ఉన్నారనే వివరాలను ఎప్పటికప్పుడు కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షిస్తున్నారు.

మూడు షిఫ్టులు.. నిత్యం పర్యవేక్షణ

కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో షిఫ్టుకు ఐదుగురు చొప్పున మూడు షిఫ్టుల్లో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. నిత్యం వచ్చే ఫిర్యాదులపై అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు సంబంధిత బృందాలకు సూచనలు చేస్తూ పరిష్కరిస్తున్నారు. ఉదయం 6 గంటలకు వచ్చిన వారు మధ్యాహ్నం 2 వరకు, మధ్యాహ్నం 2 గంటలకు వచ్చిన వారు రాత్రి 10 వరకు, రాత్రి 10 గంటలకు వచ్చిన వారు ఉదయం 6 గంటల వరకు విధులు నిర్వహిస్తున్నారు. కాగా ప్రతిరోజూ కలెక్టర్ గౌతమ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించడంతో పాటు వివరాలు తెలుసుకుని ఎప్పటికప్పుడు మెరుగైన చర్యలు చేపడుతున్నారు.

జంగ్ తెలంగాణ



చంద్రుగొండ: ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఓటు వజ్రాయుధం లాంటిది..

ఫ్లాగ్ మార్చ్‌లో పోలీసులు

చంద్రుగొండ/దమ్మపేట/అన్నపురెడ్డిపల్లి/ములకలపల్లి/గుండాల : ఓటుహక్కు వజ్రాయుధం లాంటిదని ప్రలోభాలకు గురై దుర్వినియోగం చేయొద్దని కొత్తగూడెం, పాల్వంచ డీఎస్పీలు అబ్దుల్ రెహమాన్, వెంకటేశ్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సమీపిస్తున్న నేపథ్యంలో మండల కేంద్రంలో ఆదివారం కొత్తగూడెం పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వేచ్ఛాయుత, శాంతియుత వాతావరణంలో ఎన్నికల పోలింగ్ జరిగేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. నియమనిబంధనలు ఉల్లఘించే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించుకునేందుకు పార్టీలు అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. మద్యం, డబ్బులకు ఓట్లు అమ్ముకోవద్దని, ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కాగా, పోలీస్‌స్టేషన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ వరకు సాగింది. కార్యక్రమంలో జూలూరుపాడు సీఐ శ్రీనివాసరావు, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి ఎస్‌ఐలు మాచినేని రవి, షాహిన వివిధ మండలాలకు చెందిన ఎస్‌ఐలు, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు. అలాగే, దమ్మపేటలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్వంచ డీఎస్పీ, అశ్వారావుపేట సీఐ కరుణాకర్, దమ్మపేట ఎస్‌ఐ రవికుమార్, అదనపు ఎస్‌ఐ సందీప్, ఏఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కాగా, అన్నపురెడ్డిపల్లిలో జరిగిన కార్యక్రమంలో కొత్తగూడెం, పాల్వంచ డీఎస్పీలతోపాటు జూలూరుపాడు సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐలు షాహిన, రవి పాల్గొన్నారు. అలాగే, ములకలపల్లిలో జరిగిన కార్యక్రమంలో పాల్వంచ డీఎస్పీతోపాటు సీఆర్‌పీఎఫ్, టీఎస్‌పీఎస్ దళాలు, అశ్వారావుపేట సీఐ కరుణాకర్, ములకలపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట ఎస్‌ఐలు సాయికిశోర్‌రెడ్డి, రవికుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు. అలాగే, గుండాలలో నిర్వహించిన కార్యక్రమంలో సీఐ ఎల్.రవీందర్, ఎస్‌ఐ కిన్నెర రాజశేఖర్ సీఆర్‌పీఎస్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.



అన్నపురెడ్డిపల్లి: ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

క్లుప్తంగా

పేకాట స్థావరంపై దాడి

భద్రాచలంఅర్బన్: పేకాట స్థావరంపై దాడి చేసి 13 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. భద్రాచలంటౌన్ సీఐ నాగరాజురెడ్డి కథనం ప్రకారం.. పట్టణ శివారు ప్రాంతంలో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందగా పోలీసులు అక్కడికి వెళ్లి 13 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.1,28,620 నగదు, 13 సెల్‌ఫోన్లు, 11 ద్విచక్రవాహనాలు, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నామని, పట్టుబడిన వారిలో ఓ ప్రధాన పార్టీకి చెందిన యువ నాయకుడు కూడా ఉన్నాడని సీఐ వెల్లడించారు.

కేసు నమోదు

టేకులపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడిన ఘటనపై ఆదివారం కేసు నమోదైంది. ఎస్‌ఐ గన్‌రెడ్డి రమణారెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని ప్రెగళ్లపాడు పంచాయతీ దుబ్బతండా గ్రామానికి చెందిన లాకావత్ వెంకట్రావు ఈ నెల 21న రాత్రి టేకులపల్లి నుంచి దుబ్బతండాకు బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా దూసుకొచ్చిన మరో బైక్ ఢీకొట్టింది. దీంతో వెంకట్రావుకు తీవ్రగాయాలయ్యాయి. ఆదివారం బాధితుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు ద్విచక్రవాహనదారుడు మధుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

భర్త ఇంటి ఎదుట భార్య నిరసన



నిరసన తెలుపుతున్న నిహారిక

సత్తుపల్లిరూరల్: తనకు న్యాయం చేయాలని భర్త ఇంటి ఎదుట భార్య పెట్రోల్ సీసాతో నిరసన వ్యక్తం చేసిన ఘటన సత్తుపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. పట్టణంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన కోనేటి హరికృష్ణతో నిహారికకు 2018లో వివాహమైంది. దంపతుల మధ్య కొంతకాలంగా మనస్పర్ధలు ఉన్నాయి. దీంతో భర్త హరికృష్ణ పుట్టింటికి పంపించాడని ఆమె వాపోయింది. ఐదేళ్ల కుమారుడు ఉన్నాడని, వారంలో రెండు రోజులు తన దగ్గర, మిగతారోజులు అతని దగ్గర ఉండేలా పెద్దలు ఒప్పందం చేశారని తెలిపింది. అయితే, తన బిడ్డను తనతో పంపించడం లేదని భర్త కూడా తనతో ఉండాలని ఆమె కోరుతూ హనుమాన్‌నగర్‌లోని భర్త హరికృష్ణ ఇంటి ముందు నిరసన వ్యక్తం చేశారు.

మద్యం సీసాలు పట్టివేత

కామేపల్లి: ముచ్చర్ల గ్రామంలోని రాయల లక్ష్మికి చెందిన బెల్ట్ షాపులో సుమారు రూ.50 వేలు విలువైన 48 మద్యం సీసాలను పట్టుకొని ఆమెపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

కారేపల్లి: మండలంలోని విశ్వనాథపల్లి గ్రామంలోని ఓ దుకాణంలో మద్యం విక్రయిస్తుండగా.. తనిఖీ చేసి 7 మద్యం సీసాలను పట్టుకున్నట్లు కారేపల్లి ఎస్‌ఐ పుష్పాల రామారావు ఆదివారం వెల్లడించారు. మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

ఆరేళ్ల అనంతరం అమ్మ చెంతకు..

ఖమ్మంఅర్బన్: మతిస్థిమితం కోల్పోయి ఆరేళ్ల కిందట ఇంటి నుంచి తప్పిపోయిన యువకుడు రాష్ట్ర సరిహద్దులు దాటి వచ్చాడు. ప్రస్తుతం కోలుకుని తిరిగి అమ్మ చెంతకు చేరనున్నాడు. అన్నం ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. ఆరేళ్ల కిందట మతిస్థిమితం లేని యువకుడు ఖమ్మంలో ప్రజలను ఇబ్బంది పెడుతుండగా పోలీసులు అన్నం ఫౌండేషన్‌కు అప్పగించారు. అక్కడ చికిత్స పొంది కోలుకున్న యువకుడి నుంచి సమాచారం తెలుసుకుని అతడి ఫొటో, వివరాలను ఉత్తరప్రదేశ్ పోలీసులకు పంపించారు. అక్కడి పోలీసులు యువకుడి వివరాలు కనుక్కున్నారు. డియోరియా జిల్లా రుద్రపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జంగిల్ ఇమిలిహ గ్రామానికి చెందిన యువకుడిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు యువకుడిని గుర్తించి వీడియో కాల్ ద్వారా మాట్లాడి, తమ కుమారుడేనని నిర్ధారించారు. కాగా, యువకుడి పేరు పొన్నాలాల్‌యాదవ్ అని, అతడికి తండ్రి లేకపోగా నలుగురు సోదరీమణులు ఉన్నాట్లు తెలిసింది. వారంతా ఆశలు వదులుకున్న సమయంలో ఇప్పుడు వారి చెంతకు చేరనున్నాడు. యువకుడి కుటుంబ సభ్యులు నిరుపేదలు కావడంతో ఖమ్మం నుంచి రప్తిసాగర్ ఎక్స్‌ప్రెస్‌లో అన్నం శ్రీనివాసరావు యువకుడిని తీసుకుని సోమవారం బయలుదేరేందుకు సిద్ధమయ్యారు. ఫౌండేషన్ నుంచి రూ.25 వేలు ఆర్థిక సాయం కూడా అందిస్తున్నామని శ్రీనివాసరావు వెల్లడించారు.



కోలుకున్న ఉత్తరప్రదేశ్ వాసి పొన్నాలాల్‌యాదవ్

నిబంధనలు ఉల్లంఘించిన డీలర్ సస్పెండ్

నేలకొండపల్లి: మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ చౌక ధరల దుకాణం డీలర్ పేరాల సత్యనారాయణ (గాంధీ) అధికార పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఆయన్ను సస్పెండ్ చేస్తూ ఖమ్మం ఆర్‌డీఓ ఉత్తర్వులు జారీ చేశారు. నేలకొండపల్లి డీలర్ సత్యనారాయణ బీఆర్‌ఎస్ కార్యక్రమంలో పాల్గొనడంతో పాటు ఓటర్లను ప్రభావితం చేస్తున్నాడని.. నిబంధనలు ఉల్లంఘిస్తున్నాడని ఫిర్యాదులు అందాయి. దీంతో పాలేరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజేశ్వరి స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓలను నివేదిక కోరారు. ఇరువురి నివేదిక అనంతరం రిటర్నింగ్ అధికారి సదరు డీలర్‌పై చర్యలు తీసుకోవాలని ఖమ్మం ఆర్‌డీఓకు సిఫార్సు చేశారు. ఆదివారం సదరు డీలర్ సత్యనారాయణ (గాంధీ)ను సస్పెండ్ చేస్తూ ఖమ్మం ఆర్‌డీఓ ఉత్తర్వులు జారీ చేశారు.


పోలీస్ పహారా మధ్య గోవిందాపురం

బోనకల్: మండలంలోని గోవిందాపురం (ఎల్) గ్రామంలో సీపీఎం కార్యకర్త ఎర్రబోయిన నాగేశ్వరరావు హత్య నేపథ్యంలో మధిర సీఐ వసంత్‌కుమార్ ఎస్‌ఐ సాయికుమార్ ఆధ్వర్యంలో గ్రామంలో భారీ పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. సుమారు 50 మందికి పైగా పోలీసులు పహారా కాస్తున్నారు. సీఐ వసంత్‌కుమార్ మాట్లాడుతూ.. అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



గ్రామంలో పహారా కాస్తున్న పోలీసులు

ఆటో పల్టీ



ప్రమాదంలో గాయపడిన మహిళ

కొణిజర్ల: ఆటో పల్టీ కొట్టి ముగ్గురు కూలీలు గాయాలపాలైన ఘటన మండలంలోని తనికెళ్ల సమీపంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఆదివారం తనికెళ్లకు చెందిన కొందరు మహిళా కూలీలు ఆటోలో పొలం పనులకు వెళ్లి మధ్యాహ్నం తిరిగి వస్తుండగా తనికెళ్ల ముత్యాలమ్మ బావి సమీపంలో ప్రమాదవశాత్తు పల్టీ కొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న 5 మంది కూలీలలో ఎస్.జయమ్మ, జానకమ్మ, రమణమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన ఇద్దరు క్షేమంగా బయటపడ్డారు. ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఆటో పల్టీ కొట్టిందని కూలీలు చెబుతున్నారు. క్షతగాత్రులకు స్థానికంగా ప్రాథమిక చికిత్స చేయించి ఖమ్మం తరలించారు.

చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేసిన ఏసీపీ

కూసుమంచి: ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం జిల్లా సరిహద్దు నాయకన్‌గూడెంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను ఆదివారం రాత్రి ఖమ్మంరూరల్ పలు వాహనాలను ఏసీపీ బస్వారెడ్డి తనిఖీ చేశారు. నగదు, మద్యం, బంగారం లాంటి వస్తువులను సరఫరా చేస్తున్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. సరైన పత్రాలు లేని వాహనాలను గుర్తించి సీజ్ చేయాలని పేర్కొన్నారు. ఏసీపీ వెంట కూసుమంచి సీఐ జితేందర్‌రెడ్డి, ఎస్‌ఐ రమేశ్‌కుమార్ ఉన్నారు.



అంబులెన్స్‌ను తనిఖీ చేస్తున్న ఏసీపీ

పాఠశాలల క్రీడా జట్ల ఎంపిక

ఖమ్మంస్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి పాఠశాలల క్రీడల జట్ల ఎంపికలను ఆదివారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియం, సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో చేపట్టారు. అండర్ – 17, 14 నెట్‌బాల్, జూడో, ఉషూ బాలబాలికల ఎంపికలకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి 90 మంది క్రీడాకారులు ఎంపికల్లో పాల్గొన్నారు. ఈ ఎంపికల ప్రక్రియను పీఈటీలు పీవీ రమణ, ఎండీ షఫీక్ అహ్మద్, కృష్ణమూర్తి, శ్రీనివాస్, నెట్‌బాల్ సంఘం కార్యదర్శి ఫణి పరిశీలించారు. నెట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలు ఖమ్మంలో, జూడో పోటీలు వరంగల్‌లో, ఉషూ పోటీలు మహబూబాబాద్‌లో జరుగుతాయని తెలిపారు. ఉమ్మడి జిల్లా నెట్‌బాల్ అండర్ – 17 జట్టుకు ఎంపికైన వారి వివరాలను జిల్లా పాఠశాలల క్రీడల సంఘం కార్యదర్శి కె.నర్సింహారావు ప్రకటించారు. అండర్ – 17 నెట్‌బాల్ బాలుర జట్టుకు జి.వసంత్, ఎస్. మణికంఠ, ఎండీ అబిద్, ఎస్.జయదీప్, టి.సిద్ధు, బి. సిద్ధార్థ, కె.స్నేహిత్, వెంకట్. డి.ఈశ్వర్, జె.రంజిత్, పి.మోహన్‌కృష్ణ, జి.నాగకౌషిక్ ఎంపికయ్యారు. బాలికల జట్టుకు జి.హారిక, ఎ.మహేశ్వరి, కె.రుచిరసాయి. జె.మమత, వి.సాయిచరిత, జి.మౌనిక, డి.దీక్షిత, ఎస్.లక్ష్మిప్రసన్న, ఆర్.హాసిక, సీహెచ్ అమృత, డి.షణ్ముకహారిని, జూడో బాలికల జట్టుకు జి.హర్షవర్ధన్, ఎం.ప్రణవ్‌కుమార్, ఎస్.మనోహర్, సీహెచ్ పార్థివ్, డి.దేవ్లానాయక్, బి.చరణ్‌తేజ, బి.గణేశ్, బాలికల జట్టులో సీహెచ్.కరీష్మా, సీహెచ్. హిమవర్ధిని, బి.స్పందన, ఎస్‌డీ సన, పి.జాహ్నవి, జి.లిఖిత, ఉషూ జట్టులో డి.నరేశ్, కె.దేవమణికంఠ, జి.సాత్విక్‌నాయుడు, వై.సుశాంత్, టి.అఖిలేశ్, బాలికల జట్టులో సాయిమౌనిక, హారిక, ఈశ్వరీ తదితరులు పాల్గొన్నారు.



బాలికల నెట్‌బాల్ జట్టు

రిటైర్డ్ అధ్యాపకుడు అదృశ్యం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 12వ డివిజన్ పోలీస్‌కాలనీలో నివాసం ఉంటున్న రిటైర్డ్ అధ్యాపకుడు బోయిన భరత్‌కుమార్ కనిపించకుండా పోయినట్లు భార్య రమ ఇచ్చిన ఫిర్యాదుపై ఆదివారం ఖమ్మంఅర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. మానసికస్థితి సరిగా లేక మందులు వాడుతున్నాడని, ఆదివారం ఉదయం 9 గంటల సమయంలో బయటకు వెళ్లి తిరిగి రాలేదని, ఎక్కడ వెతికినా ఫలితం లేకుండాపోయిందని భార్య ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తమ్ముడిని చంపిన అన్న


బోనకల్: మద్యం మత్తులో సోదరుల మధ్య జరిగిన ఘర్షణలో తమ్ముడు మృతి చెందగా అన్నకు తీవ్ర గాయాలైన ఘటన మండల కేంద్రంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జంపాల గణేశ్, మణికంఠ సోదరులు. గణేశ్‌కు భార్య, కుమార్తె ఉండగా మణికంఠకు వివాహం కాలేదు. ఇద్దరూ బార్బర్ షాపు నడిపించడంతో పాటు కూలిపనులకు వెళ్తుంటారు. ఇద్దరూ మద్యానికి బానిసలు కావడంతో గణేశ్ భార్య నాలుగేళ్ల కిందటే పుట్టింటికి వెళ్లింది. శనివారం రాత్రి సోదరులు మద్యం సేవించి ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో మణికంఠ (25) మృతిచెందగా గణేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. డాబా పైనుంచి పడినట్లు నమ్మించినప్పటికీ ఆ తరువాత విషయం బయటపడింది.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఎర్రుపాలెం: మండల కేంద్రానికి చెందిన గద్దల ఆదాం (57) ఆదివారం రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి కథనం ప్రకారం.. గద్దల ఆదాం కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆదివారం ఉదయం రైల్వేగేట్ సమీపంలో గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్‌ఐ పి.భాస్కర్‌రావు కేసు నమోదు చేశారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పెనుబల్లి: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కొత్తకారాయిగూడెం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కొమ్మెర బోయిన పూర్ణచందర్‌రావు (40) ఇంట్లో లైట్లు వెలకగపోవడంతో కరెంట్ బోర్డులు విప్పి మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఆయన వీఎం బంజర్‌లో చికెన్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు.



పూర్ణచందర్‌రావు (ఫైల్)

ఇరువర్గాల మధ్య ఘర్షణ

నేలకొండపల్లి: దారి విషయంలో ఇరువర్గాలకు చెందినవారు ఘర్షణకు దిగారు. ఈ ఘటనలో మాజీ సర్పంచ్‌తో పాటు పలువురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని అజయ్‌తండాలో దారి విషయంలో గ్రామానికి చెందిన ఇరువర్గాల మధ్య ఘర్షణ తారాస్థాయికి చేరింది. ఆదివారం సమస్య పరిష్కరించేందుకు ఎస్‌ఐ సతీశ్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇరు వర్గాలకు సర్దిజెప్పి వెళ్లిపోయారు. వెంటనే వారు తిరిగి ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో మాజీ సర్పంచ్ తేజావత్ శివాజీ, యం.బాలాజీలపై దాడి చేశారు. వారికి అండగా వచ్చిన బాటసారి వెంకటేశ్వర్లుపై కూడా దాడి చేసినట్లు బాధితులు పేర్కొన్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేస్తామని బాధితులు తెలిపారు. ఎస్‌ఐ సతీశ్‌ను వివరణ కోరగా.. ఘర్షణ జరిగిన విషయంపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని వివరించారు.


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బోగీలు


క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న ఏపీ విపత్తు నిర్వహణ సిబ్బంది

రెండు రైళ్లు ఢీ..

విజయనగరం జిల్లాలో పెను ప్రమాదం..

సాక్షి ప్రతినిధి విజయనగరం/జామి/లక్కవరపుకోట/శృంగవరపు కోట/పెందుర్తి/సాక్షి, అమరావతి/కొవ్వూరు: విజయనగరం జిల్లాలో ఆదివారం రాత్రి ఘోర రైలు ప్రమాదం సంభవించింది. రెండు రైళ్లు బయల్దేరిన కొద్ది నిమిషాల వ్యవధిలో ఢీకొనడంతో ఈ ఘోరం జరిగింది. ఈ పెను ప్రమాదంలో 12 మంది మరణించగా.. 32 మందికి పైగా గాయపడ్డారు. వీరిని విశాఖపట్నం, విజయనగరం ప్రభుత్వాసుపత్రులకు తరలించారు. ఏం జరిగిందో అర్థమయ్యేలోపే కొన్ని బోగీలు నుజ్జునుజ్జయ్యాయి. దీంతో ఒక్కసారిగా అరుపులు, కేకలు, హాహాకారాలతో ఆ ప్రాంతం భయానకంగా మారింది. ఈ హృదయ విదారక ఘటన ఆదివారం రాత్రి జామి మండల పరిధిలో జరిగింది. ఈ దుర్ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. హుటాహుటిన సహాయక చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. వివరాలివీ..

విశాఖ నుంచి-పలాస వెళ్లే ప్యాసింజర్ రైలు ఆదివారం సా.6.25 గంటలకు కొత్తవలస రైల్వేస్టేషన్ నుంచి బయల్దేరింది. భీమాళి రైల్వేస్టేషన్ దాటిన తర్వాత అలమండ రైల్వేస్టేషన్ నుంచి సిగ్నల్ రాకపోవడంతో డ్రైవర్ రైలును నెమ్మదిగా నడుపుతున్నారు. అదే సమయంలో సా.6.40 గంటల ప్రాంతంలో రాయగడ పాసింజర్ కొత్తవలస నుంచి బయల్దేరింది. వేగంగా వస్తున్న రాయగడ పాసింజర్ అదే ట్రాక్‌పై ముందు వెళ్తున్న పలాస పాసింజర్ రైలును రాత్రి 7.10 గంటల సమయంలో వెనుక నుంచి భీమాళి-అలమండ రైల్వేస్టేషన్ల మధ్య ఢీకొట్టింది. దీంతో పలాస పాసింజర్ వెనుకనున్న రెండు బోగీలు, వాటిని ఢీకొన్న రాయగడ ప్యాసింజర్ రైలు ఇంజన్‌తో పాటూ మరో మూడు బోగీలు పలాస రైలు మీద పడి నుజ్జునుజ్జయ్యాయి. అదే సమయంలో కొన్ని బోగీలు పక్క ట్రాక్‌పై ఉన్న గూడ్స్ మీద పడ్డాయి. దీంతో పెను విషాదం అలముకుంది.

మృతులు 12 మంది..

ఈ ఘటనలో 12 మంది మృతిచెందినట్లు గుర్తించారు. వారి మృతదేహాలను బయటికి తీశారు. నుజ్జునుజ్జయిన బోగీల్లో మరిన్ని మృతదేహాలు ఉండే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇక బోగీల్లో చిక్కుకున్న మృతదేహాలను వెలికి తీసేందుకు సహాయక చర్యలను ముమ్మరం చేశారు. మృతుల్లో ఒక లోకో పైలట్ ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే 32 మంది క్షతగాత్రులను 20 అంబులెన్స్‌ల్లో విజయనగరం, విశాఖల్లో వేర్వేరు ఆస్పత్రులకు తరలించారు.

చీకట్లో సహాయక చర్యలు..

ఇక ప్రమాద స్థలిలో విద్యుత్ వైర్లు తెగిపోవటంతో పూర్తిగా చీకట్లు అలముకున్నాయి. దీంతో సహాయక చర్యలు కాస్త నెమ్మదిగా జరుగుతున్నాయి. రెండు రైళ్లలో మిగిలిన బోగీల్లో ఉన్న ప్రయాణికులు రోడ్డు మార్గంలో తమ గమ్యాలకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం దెబ్బతిన్న బోగీల్లో చిక్కుకున్న వారిని బయటికి తీసేందుకు స్థానికులు, రైల్వే, జిల్లా అధికార యంత్రాంగం, పోలీసులు, వైద్య సిబ్బంది తదితరులు అంతా సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

హుటాహుటిన ప్రజాప్రతినిధులు, అధికారుల రాక


ప్రమాద ఘటన వార్త తెలుసుకున్న వెంటనే మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ ఎం.దీపికతో పాటూ పలువురు జిల్లా అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలను సమీక్షించారు. జిల్లా యంత్రాంగానికి మంత్రి బొత్స పలు సూచనలు చేశారు. ప్రస్తుతం ఘటనాస్థలిలో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి.

వైద్యశాఖ అప్రమత్తం..

ప్రమాద ఘటన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వైద్యశాఖను పూర్తిస్థాయిలో అప్రమత్తం చేసింది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. ప్రమాదం గురించి తెలిసిన కొద్ది నిమిషాల్లోనే అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం 108 అంబులెన్సులను ఘటనా స్థలికి తరలించింది. విజయనగరం, అనకాపల్లి, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల నుంచి 30 వరకూ 108 అంబులెన్సుల్లో క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు. తీవ్రంగా గాయపడిన వారిని విశాఖ కేజీహెచ్‌కు.. స్వల్పంగా గాయపడ్డ వారిని విజయనగరంతో పాటు, సమీపంలోని ప్రభుత్వాస్పత్రులకు తరలించారు. బాధితులకు వైద్య సహాయార్థం కేజీహెచ్‌లో 24/7 హెల్ప్‌లైన్ నెంబర్లను ఏర్పాటుచేశారు. మరోవైపు.. ప్రమాద స్థలంలోనే క్షతగాత్రులకు తక్షణ వైద్యం కోసం ప్రత్యేక వైద్య బృందాలను రంగంలోకి దించారు.

సీఎం జగన్ దిగ్భ్రాంతి

ఇక ఈ దుర్ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. విశాఖ నుంచి రాయగడ వెళ్తున్న ప్యాసింజర్ రైలుకు ప్రమాదం జరిగినట్లుగా.. పలు బోగీలు పట్టాలు తప్పినట్లుగా ప్రాథమిక సమాచారం అందుతోందని సీఎంఓ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వెంటనే హుటాహుటిన సహాయక చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. విజయనగరం సమీప జిల్లాలైన విశాఖపట్నం, అనకాపల్లి నుంచి వీలైనన్ని అంబులెన్సులను పంపించాలని, మంచి వైద్యం అందించడానికి సమీప ఆస్పత్రుల్లో అన్నిరకాల ఏర్పాట్లుచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వైద్య ఆరోగ్య, పోలీసు, రెవిన్యూ సహా ఇతర ప్రభుత్వ శాఖలు సమన్వయంతో వేగంగా సహాయక చర్యలు చేపట్టి, క్షతగాత్రులకు సత్వర వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. ఘటనకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తనకు నివేదించాలన్నారు. మరోవైపు.. దుర్ఘటనపై రాష్ట్ర హోం, విపత్తుల నివారణ శాఖ మంత్రి తానేటి వనిత కూడా దిగ్భ్రాంతి వ్యక్తంచేసి మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని 'సాక్షి'కి చెప్పారు.



ముఖ్యమంత్రికి రైల్వే మంత్రి ఫోన్

ఈ ప్రమాదంపై కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సీఎం జగన్‌తో ఫోన్‌లో ఆదివారం రాత్రి మాట్లాడారు. ప్రమాదం జరిగిన వెంటనే తీసుకున్న చర్యలను సీఎం జగన్ ఆయనకు వివరించారు. సహాయ బృందాలను వెంటనే ఘటనా స్థలానికి పంపించామని, క్షతగాత్రులకు వైద్యం అందించేందుకు సత్వర చర్యలు తీసుకున్నామని చెప్పారు. జిల్లాకు చెందిన మంత్రి బొత్స సత్యనారాయణ, స్థానిక కలెక్టర్, ఎస్పీ అక్కడే ఉండి సహాయ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. క్షతగాత్రులకు సరైన వైద్యసేవలు అందించడంపై అధికారులు దృష్టిపెట్టారని, వీరిని సమీపంలో ఉన్న ఆస్పత్రులకు పంపిస్తున్నారని, ఆ మేరకు ఆయా ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్యసేవలు అందించేలా చర్యలు కూడా తీసుకున్నామని సీఎం కేంద్ర మంత్రికి చెప్పారు.

ఏపీ మృతులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా

విజయనగరం జిల్లాలో రైలు ప్రమాదంలో మృతుల కుటుంబాలతో పాటు, క్షతగాత్రులకు సీఎం జగన్ ప్రభుత్వం అండగా నిలిచింది. ఏపీకి చెందిన మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షలు, తీవ్రంగా గాయపడ్డ వారికి రూ.2 లక్షలు చొప్పున సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. రైలు ప్రమాద ఘటనలో మరణించిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు అన్నిరకాల చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. మరణించిన వారిలో ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఉంటే బాధిత కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, తీవ్రంగా గాయపడ్డ వారికి రూ.50వేల చొప్పున సహాయం అందించాలన్నారు.

ఏం జరిగిందో అర్థంకాలేదు..

పార్వతీపురంలోని మా ఇంటికి వెళ్లేందుకు పెందుర్తిలో రైలెక్కాను. సుమారు గంట తరువాత అకస్మాత్తుగా రైలు భారీ కుదుపునకు గురైంది. మా బోగిలో అందరూ చెల్లాచెదురైపోయారు. కాసేపు ఏం జరిగిందో అర్థంకాలేదు. తేరుకునేటప్పటికి నా కాలికి తీవ్ర గాయమైంది. మా అల్లుడు వచ్చి పెందుర్తి ఆసుపత్రిలో చికిత్స చేయించాడు.

– వరలక్ష్మి, ప్రమాదంలో గాయపడిన మహిళ

వెనుక నుంచి ఢీకొట్టడంవల్లే..

ప్రమాద ఘటనపై రైల్వేశాఖ ప్రాథమిక ఎఫ్ఐఆర్	రాత్రి 7 గంటలకు జరిగినట్లు నిర్ధారణ	10 నిమిషాల వ్యవధిలో కంటకాపల్లి నుంచి బయలుదేరిన రైళ్లు

సాక్షి, విశాఖపట్నం/విజయనగరం అర్బన్/రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): వాల్తేరు డివిజన్ పరిధిలోని విజయనగరం జిల్లా అలమండ సమీపంలో రైలు ప్రమాదం జరిగిన ప్రాంతం భీతావహంగా మారింది. ఈ ప్రమాదం ఎలా జరిగిందన్న దానిపై వాల్తేరు రైల్వే డివిజన్ అధికారులు ప్రాథమిక ఎఫ్ఐఆర్ సిద్ధంచేసి రైల్వే మంత్రిత్వ శాఖకు పంపించారు. ప్రమాదం ఎప్పుడు జరిగింది? ఏఏ రైళ్లు ప్రమాదానికి గురయ్యాయి? అనే ప్రాథమిక అంశాల్ని అందులో పొందుపరిచారు. ఈ ఎఫ్ఐఆర్ ప్రకారం వివరాలిలా ఉన్నాయి..

- **ప్రమాదం జరిగిన తీరు:** వెనుక నుంచి ఢీకొట్టడంవల్ల..
- **ప్రమాదం జరిగిన సమయం** : 29 అక్టోబరు రాత్రి 7 గంటలకు..
- **డివిజన్** : వాల్తేరు రైల్వే డివిజన్
- **ఏ సెక్షన్‌లో జరిగింది** : కంటకాపల్లి–అలమండ డీఎన్ మిడిల్ లైన్‌లో
- **ప్రమాదం జరిగిన ప్రాంతం** : 840/27 కి.మీ వద్ద
- **ఏఏ రైళ్లు ప్రమాదానికి గురయ్యాయి** : 08532 ఎక్స్‌ప్రెస్, 08504 ఎక్స్‌ప్రెస్
- **సమీప స్టేషన్ నుంచి ఎప్పుడు బయలుదేరాయి** : 08532 ఎక్స్‌ప్రెస్ సా. 6.42 గంటలకు బయల్దేరింది.. 08504 ఎక్స్‌ప్రెస్ 6.52 గంటలకు బయలుదేరింది
- **ఇతర సమాచారం** : యాక్సిడెంట్ రిలీఫ్ మెడికల్ ఎక్విప్‌మెంట్ కోసం 7.05కి సమాచారం ఇచ్చారు
- 7.07 గంటలకు యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్‌ను (ఏఆర్‌టీ) ఆర్డర్ చేయగా 7.31 గంటలకు విశాఖ నుంచి బయల్దేరింది.
- 7.10 గంటలకు 120 టన్నుల క్రేన్ బయల్దేరింది
- **సహాయక చర్యల్లో పాల్గొన్న అధికారులు** : వాల్తేరు డివిజన్ డీఆర్ఎం, ఏడీఆర్ఎం(ఆపరేషనల్), ఇతర అధికారులు

బాధితుల సమాచారం కోసం కంట్రోల్ రూం..

బాధితులకు సహాయం, వారి సమాచారం తెలుసుకోవడం కోసం కంట్రోల్ రూంలను ఏర్పాటుచేసినట్లు విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి తెలిపారు.

కలెక్టరేట్ కార్యాలయంలో :
9493589157
రైల్వే శాఖలో :
89780 80006
రైల్వే కంట్రోల్ రూంలో :
8978080777
విశాఖ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్:
9030226621,
7036111169,
0891 2590102

విజయవాడ డివిజన్ అధికారులు ప్రకటించిన హెల్ప్‌లైన్ నంబర్లు..
ఏలూరు :
0881-2232267
సామర్లకోట :
0884-2327010
రాజమహేంద్రవరం :
0883-2420541
తుని :
0885-4252172

రైలు ప్రమాదంపై ప్రధాని విచారం

మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల పరిహారం

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ఆదివారం రెండు రైళ్లు ఢీకొన్న ప్రమాదంలో ప్రాణ నష్టం జరగడం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధాని జాతీయ విపత్తుల సహాయ నిధి నుంచి రూ.రెండు లక్షల చొప్పున పరిహారాన్ని చెల్లించనున్నట్లు ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.50,000 చొప్పున సహాయం అందించనున్నట్లు ప్రధాని కార్యాలయం తెలిపింది. తక్షణమే పరిస్థితిని సమీక్షించాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను ప్రధాని ఆదేశించారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

జిల్లా వార్తలు

అంతర్జాతీయ సదస్సుకు న్యాయవాది ఎంపిక


రామకృష్ణను సన్మానిస్తున్న ఎస్‌బీఐ అధికారులు

కల్లూరు: ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ అంతర్జాతీయ సదస్సుకు కల్లూరు పట్టణం అంబేద్కర్ నగర్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది ఉబ్బన రామకృష్ణ ఎంపికయ్యారు. నవంబర్ 3న థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో జరుగనున్న సదస్సులో ఆయన పాల్గొనున్నారు. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ అధికారులు ఖమ్మంలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణను పలువురు అభినందించారు. రామకృష్ణ చేస్తున్న సేవలకు గాను అరుదైన గౌరవం దక్కిందని అన్నారు. ఆయనతో పాటు ఖమ్మం నుంచి డీఆర్ఎంఐ రవీందర్‌రెడ్డి, డీఎస్ఎంఏ సంతోషరెడ్డి, జీలుగుమాడు నుంచి ఎస్ఎం కోట నరసింహారావు, ముదిగొండ నుంచి రవికుమార్ బ్యాంకాక్ వెళ్లనున్నారు.

రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

కర్ణాటక ఎమ్మెల్సీ సతీష్


ఎమ్మెల్సీ సతీష్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

చుంచుపల్లి : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకొని తెలంగాణలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని కర్ణాటక బీజేపీ శాసన మండలి సభ్యుడు సతీష్ అన్నారు. ఆదివారం కొత్తగూడెం విద్యానగర్‌లో నియోజకవర్గ క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా బీజేపీకి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పని చేయాలని దిశా నిర్దేశం చేశారు. అనంతరం సతీష్‌ను కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు లక్కినేని సురేందర్, ఎడ్లపల్లి శ్రీనివాసరావు, రాయుడు నాగేశ్వర్ రావు, లక్కినేని సాయి కృష్ణ, పైడిపల్లి రవీందర్, లక్ష్మణ్ అగర్వాల్, రాజేష్ నాయక్, మలోత్ గాంధీ, బాణోత్ రమేష్, స్వాతి, పూర్ణ చందర్‌రావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేయూ క్రీడలపై నీలినీడలు

- మూడు నెలలు గడుస్తున్నా జరగని పోటీలు
- ఇప్పటికీ స్పందించని కేయూ స్పోర్ట్స్ బోర్డ్
- అయోమయంలో క్రీడాకారులు
- ఆలస్యం వెనుక ఆంతర్యం ఏమిటో?



ఖమ్మంస్పోర్ట్స్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో క్రీడల నిర్వహణపై ఇప్పటివరకు కళాశాలలకు ఎలాంటి సమాచారం అందకపోవడంతో ఔత్సాహికుల్లో నిరాశ అలుముకుంటోంది. ఇప్పటికే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు క్రీడల క్యాలెండర్‌ను ఖరారు చేసింది. అయినా యూనివర్సిటీ స్థాయి పోటీలు నిర్వహించకపోవడం గమనార్హం. కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో దాదాపు 300కి పైగా కళాశాలలున్నాయి. జూలై – ఆగస్టు నెలలోనే సమావేశమై యూనివర్సిటీ పరిధి క్రీడాపోటీల క్యాలెండర్‌ను ఖరారు చేయాలి. కానీ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు నిర్లక్ష్యం వల్ల ఇప్పటివరకు ఎలాంటి సమావేశాలు జరగకపోగా, పోటీల తేదీలు వెల్లడించలేదు. దీంతో కళాశాలల్లో చదివే విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కరోనా నుంచి దూరం

ఇప్పటికే కొన్ని క్రీడాంశాలకు సంబంధించి ఇంటర్ యూనివర్సిటీ పోటీల తేదీలు ఖరారయ్యాయి. కానీ, కాకతీయ యూనివర్సిటీ స్థాయి పోటీల నిర్వహణపై స్పోర్ట్స్ బోర్డ్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గతంలో రెండేళ్ల పాటు కరోనాతో క్రీడారంగం కుంటుపడింది. గత ఏడాది నుంచే జాతీయస్థాయి యూనివర్సిటీ పోటీలకు పంపుతున్నారు. ఇంతలోనే ఈ ఏడాది ఇప్పటికే జరగాల్సిన పోటీల నిర్వహణపై ఎలాంటి సమాచారం లేక క్రీడాకారులు మీమాంసలో పడిపోయారు. జిల్లాల్లో వివిధ క్రీడాంశాల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు యూనివర్సిటీ క్రీడలు ఎంతో ఊతమిస్తాయి. తద్వారా జాతీయస్థాయిలోనూ సత్తా చాటితే విద్యా, ఉద్యోగ రంగాల్లో అవకాశాలు మెరుగవుతాయి. కానీ, స్పోర్ట్స్ బోర్డు నిర్లక్ష్య వైఖరి కారణంగా ఈ ఏడాది యూనివర్సిటీ క్రీడలు లేక, యూనివర్సిటీ స్థాయి జట్ల ఎంపిక జరగగ సందిగ్ధత నెలకొంది.

భారీగా పెరిగిన స్పోర్ట్స్ ఫీజు

కాకతీయ యూనివర్సిటీ ఇప్పటివరకు ప్రతీ విద్యార్థి నుంచి క్రీడా రుసుం కింద రూ.60 వసూలు చేసేది. కానీ, ఈ ఏడాది రూ.300 వసూలు చేయాలని నిర్ణయించడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. రుసుం పెంచినా యూనివర్సిటీలో వసతులు మాత్రం అంతంత మాత్రంగానే ఉండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలోని ఇతర యూనివర్సిటీలతో పోలిస్తే కాకతీయ యూనివర్సిటీ క్రీడాకారులకు డీఏ కూడా చాలీచాలకుండా ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ అంశంపై గతంలో పలుమార్లు యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ల సంఘం విజ్ఞప్తి చేసినా ఫలితం కానరాలేదు. అంతేకాక క్రీడాకారుల ఎంపికకు నిర్వహించే సెలక్షన్ కమిటీకి కూడా రెండేళ్ల నుంచి ఎలాంటి ఛార్జీలు ఇవ్వడం లేదని తెలిసింది. ఇప్పటికైనా యూనివర్సిటీ అధికారులు సత్వరమే స్పందించి క్రీడా పోటీల నిర్వహణపై దృష్టి సారించాలని ఔత్సాహికులు, పీడీలు కోరుతున్నారు.

పోటీల నిర్వహణకు చొరవ చూపాలి



యూనివర్సిటీ స్థాయి పోటీలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి. తద్వారా క్రీడాకారుల భవిష్యత్‌కు బాటలు వేసినట్లవుతుంది. ఈ విషయంలో వీసీ, పాలకమండలి, స్పోర్ట్స్ బోర్డు అధికారులు స్పందించాలి. పోటీలు జరగకపోతే క్రీడాకారులు చాలా నష్టపోతారు.

–డాక్టర్ బి.వెంకన్న, కేయూ పీడీల సంఘం కార్యదర్శి

కారణం తెలియడం లేదు..



మరో పక్షం రోజుల్లో కొన్ని క్రీడాంశాలకు సంబంధించి జాతీయస్థాయిలో యూనివర్సిటీ క్రీడలు జరగనున్నాయి. కానీ, కేయూ స్థాయి పోటీలపై అధికారులు ఇంతవరకు నిర్ణయం ఎందుకు తీసుకోలేదో తెలియదు. ఇకనైనా పోటీలు నిర్వహించి జట్లు ఎంపికచేయాలి.

–డాక్టర్ శ్రీనివాసరెడ్డి, పీడీ, వరంగల్

అండర్ –19 ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక


ఎంపికైన బాలికల హ్యాండ్‌బాల్ జట్టు

ఖమ్మం స్పోర్ట్స్ : జిల్లా జూనియర్ కళాశాలల ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి అండర్ –19 క్రీడా జట్లు ఎంపికలు నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలో పాల్గొనే బాస్కెట్‌బాల్, నెట్‌బాల్, ఖో – ఖో, హ్యాండ్ బాల్, వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాంశాల్లో బాలబాలికలకు ఎంపికలు జరపగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 230 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ ఎంపికలను డాక్టర్ రఘునందన్, వీర రాఘవయ్య, వి.శ్రీనివాస్, కృష్ణయ్య, పి.శ్రీనివాస్, కృష్ణమూర్తి తదితరులు నిర్వహించారు. జిల్లా జట్టులో స్థానం పొందిన క్రీడాకారుల వివరాలను ఎం.డీ.మూసాకలీం ప్రకటించారు. బాస్కెట్‌బాల్ బాలుర జట్టులో వెంకటభ్రాత్, మహేష్, వి.శ్రీవివేక్, దివాకర్, దినేష్, లోకేష్, అభినవ్, విశాల్, బి. అభినవ్, డి.అమన్, నేతాజీ, విశాల్, బాలికల జట్టులో రిషిక, తులసి, రిమ్మ, భానుస్పందన, లాస్య, జోషిత, తమన్నా, ధరణి, క్రిస్‌రాజ్, నూర్‌జహా, సాత్విక, సంగీత, నెట్‌బాల్ బాలుర జట్టులో శ్రీరామ్, దివాకర్, గంగాప్రసాద్, రాఘవేంద్ర, శ్రీనివాస్, నేతాజీ శ్రీనివాస్, ఉదయ్‌కుమార్, ప్రేమ్ చంద్, శివ, లోకేష్, వర్షిత్, ఎక్సావీర్, ఖో–ఖో బాలుర జట్టులో సంతోష్, నమీస్‌కుమార్, జోగారావు, కార్తీక్, దేవేందర్, మహేష్, చరణ్‌తేజ్, సాయిరామ్, అఖిల్, రమేష్, విష్ణు, ఉస్‌మాన్, బాలికల జట్టుకు డి.బిందు, బి.సాయిశ్రీ, టి.వర్షిత, వైశాలి, కోసమ్మ, నిష్మిత, ఐశ్వర్య, జ్యోతి, మధుశ్రీ, కె.జ్యోతి, భవ్యమహిత, సుప్రియ, హ్యాండ్‌బాల్ బాలుర జట్టులో బన్నీ, మనోజ్, నరేందర్, శ్రీరామ్, నరేష్, క్రాంతి. దిలీప్, వికాస్, ఉదయ్, అరవింద్, కార్తీక్, సాయికుమార్, చరణ్, జన కిరణ్, అనిల్, చరణ్ తేజ, బాలికల జట్టులో నందిని, మీనాక్షి, కృష్ణవేణి, పూజిత, నిఖిత, అనూష, శ్రీలత, నవీనీత, పూజిత, అలేఖ్య, లక్ష్మి, శరణ్య, స్నేహ, సత్‌రిక,వైష్ణవి, రేష్మ, దీవెనలు ఉన్నారు.

3న క్రీడా జట్ల ఎంపికలు..

జిల్లా జూనియర్ కళాశాలల క్రీడల సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 3వ తేదీన ఉమ్మడి జిల్లాస్థాయిలో అథ్లెటిక్స్, ఆర్చరీ, టేబుల్ టెన్నిస్, ఉషూ క్రీడాంశాల్లో ఎంపికలే జరుగుతాయని జిల్లా క్రీడల సంఘం కార్యదర్శి ఎం.డీ.మూసాకలీం తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు తమ వయసు, ధృవీకరణ పత్రాలతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని తెలిపారు.

ఇల్లెందు - మేడారం బస్సు షురూ..

- ఆదరణ ఉంటే అదనపు సర్వీసులు
- సద్వినియోగం చేసుకోవాలన్న ఎస్‌టీఐ


మేడారం బయలుదేరుతున్న బస్సు

ఇల్లెందు: ఎట్టకేలకు ఇల్లెందు బస్ డిపో నుంచి మేడారం సమ్మక్క సారక్క అమ్మవార్ల గద్దెల దర్శనం కోసం ప్రతీ ఆదివారం ఒక బస్ సర్వీసు ప్రవేశపెట్టారు. ఆదివారం తెల్లవారుజామున 5.30 గంటలకు ఇల్లెందు డిపో నుంచి ఎక్స్‌ప్రెస్ సర్వీసును డిపో అధికారి సూపరింటెండెంట్ ఆఫ్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ (ఎస్టీఐ) సంజీవరాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉదయం 5.30 గంటలకు ఇల్లెందులో బస్సు బయలు దేరుతుందని, గుండాల పస్రా మీదుగా 10 గంటలకు మేడారం చేరుకుంటుందని తెలిపారు. తిరిగి సాయంత్రం 4 గంటలకు మేడారంలో బయలుదేరి రాత్రి 8 గంటలకు ఇల్లెందు వస్తుందని, పెద్దలకు రూ.160, పిల్లలకు రూ.90 టికెట్ ధరగా నిర్ణయించామని చెప్పారు. భక్తులు అమ్మవార్ల గద్దెలను దర్శించుకుని తిరిగి అదే బస్‌లో ఇల్లెందు చేరుకునేలా ఆరు గంటల పాటు మేడారంలో వేచి ఉంటుందని తెలిపారు. మేడారం వెళ్లి దర్శనం చేసుకునే భక్తులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ బస్సును ఎక్కువ మంది ప్రయాణికులు ఆదరిస్తే రానున్న కాలంలో మరిన్ని సర్వీసులు ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. కాగా, మేడారం బస్సు సర్వీస్ ప్రారంభంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

మిద్దె తోటలను విస్తృతపర్చాలి


సమావేశంలో పాల్గొన్న అడ్మిన్‌లు

- ఉత్సాహవంతులకు చేయూతనిస్తూ ప్రోత్సహించాలి
- పాఠశాల స్థాయిలో విద్యార్థులకు అవగాహన కల్పించాలి
- ఖమ్మంలో తెలుగు రాష్ట్రాల మిద్దె తోట అడ్మిన్ల సమావేశం

ఖమ్మంవ్యవసాయం: మిద్దె, పెరటి తోటల పెంపకాన్ని విస్తృత పర్చే విధంగా కృషి సాగాలని మిద్దె తోటల పెంపకందారుల అడ్మిన్ల సమావేశం నిర్ణయించింది. ఉత్సాహవంతులను పోత్సహించేందుకు అందరూ ముందుకు రావాలని నిర్ణయించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన మిద్దె తోటల అడ్మిన్ల సమావేశం ఆదివారం ఖమ్మం నగరంలోని వెంకటాయపాలెంలో కుతుంబాక మాధవి ఆధ్వర్యంలో జరిగింది. తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు మిద్దె తోటల పెంపకందారులు హాజరయ్యారు. కార్యక్రమానికి అడ్మిన్లుగా వ్యవహరిస్తున్న వారు మాట్లాడుతూ.. మిద్దె తోటల పెంపకాన్ని విస్తృత పర్చేందుకు ముందుకు వచ్చిన ఆద్యులు తెలంగాణ రాష్ట్రం యాదగిరిగుట్టకు చెందిన తుమ్మేటి రఘోత్తంరెడ్డి అని, ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆరోగ్యాన్ని రక్షించుకునేందుకు ఆహారం ముఖ్యమని, అందుకోసం ఆహార పదార్థాలను స్వయంగా పండించుకోవడం అలవర్చుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వినియోగించి పండించిన ఆహార పదార్థాలతో అనారోగ్యం వస్తుందని, సేంద్రియ ఎరువులతో పండించిన పంటలను వినియోగించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి ఆవరణలో పెరటి తోటలను ఏర్పాటు చేసుకొని ఆహార పంటలను సాగు చేసుకోవాలని, పెరటి తోటలకు అవకాశం లేని పట్టణాలు, నగరాల్లో మిద్దెలపై తోటలను పెంచుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో పెరటి తోటలపై అవగాహన ఉందని, పట్టణ, నగర ప్రాంతాల్లో మిద్దె తోటల పెంకంపై అవగాహన పెంచటంతో పాటు ప్రోత్సహించాలని సమావేశం నిర్ణయించింది. పలువురు మిద్దె తోటల పెంపకందారులు పాఠశాలస్థాయి నుంచి విద్యార్థులకు పెరటి, మిద్దె తోటల పెంపకంపై ఆసక్తి కలిగే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పలువురు అభిప్రాయపడ్డారు. సమావేశంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన కొల్లి కృష్ణమూర్తి, తమింసా అప్పారావు (టమాట అప్పారావు), విజయలక్ష్మీ, సుకన్య, సత్తిరాజు, కోసూరి ప్రసాద్, మమత, రేణుక, సందీప్, దీప, మంజుల, నిర్మల, రమణానంద తదితరులు పాల్గొన్నారు.